వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 238 బుధవారం | 27 మార్చి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




7లో

## శ్రీ సత్యసాయి కన్వెన్షన్

సకల సౌకర్యాల నిలయం

ఉమ్మడి జిల్లాకే తలమానికం

52 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం

నేషనల్ హైవే 163 పై జనగామ సమీపంలో ఏర్పాటు

వైభవోపేతంగా ప్రారంభోత్సవం

హాజరైన మంత్రి కొండా సురేఖ




8లో

## తాగునీటిపై స్పెషల్ ఫోకస్

ఇబ్బందులు లేకుండా చర్యలు

హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో సమీక్ష




8లో..

## ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర కీలకం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య

వీడియో కాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం



2లో

## కేటీఆర్ మాటలు తగ్గించుకుంటే మంచిది

ఫోన్ ట్యాపింగ్ పేరుతో అధికార దుర్వినియోగం

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి



# బీజేపీ తీరే.. సపరేట్

ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీలు, నేతలపై కక్షసాధింపు చర్యలతో ప్రయోజనం ఉంటుందా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు దేశంలో, రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే కక్షసాధింపు రాజకీయాలను ప్రజలు సహించరని తేలిపోయింది. అక్రమాలు, అన్యాయాలు జరిగితే అన్ని కేసులను ఒకే తరహాలో చూసి, వాటిపై చర్య తీసుకోవాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేజ్రీవాల్, కవితల అరెస్ట్ మోడీ ప్రభుత్వానికి ప్రత్యేకంగా కనిపించవచ్చు. అయితే ఇంతకన్నా ఘోరంగా ఉన్నాయనుకుంటున్న కేసుల్లో ఈడీ రంగంలోకి ఎందుకు దిగడం లేదన్న ప్రశ్న ఉద్భవిస్తోంది. ఏపీలో జగన్, తెలంగాణలో కేసీఆర్, అంతకుముందు చంద్రబాబుల అవినీతి విషయంలో పెద్దగా దర్యాప్తు సాగలేదు. అందుకే ప్రజలకు కేంద్రం దర్యాప్తులపై అనుమానాలు ఉన్నాయి. అయితే రేవంత్ రెడ్డిని కేసులో ఇరికించిన కేసీఆర్‌కు భంగపాటు తప్పలేదు. అలాగే జగన్ కూడా టీడీపీ వారిని అరెస్ట్ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వాన్ని నడిపారు. ఈ క్రమంలో రాజకీయాలను పరిశీలిస్తే కక్షసాధింపు రాజకీయాలను ప్రజలు సహించరని గుర్తించాలి.

- వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..

కక్ష సాధింపు రాజకీయాలతో దూకుడు

ప్రాంతీయ పార్టీలపై గురి

ప్రజలను పట్టించుకోని మోడీ

అధికార దాహంతో ఇష్టారీతిన చర్యలు

ప్రజల నమ్మకాన్ని కోల్పోతున్న బీజేపీ



# బీజేపీ తీరే సపరేట్



## కక్ష సాధింపు రాజకీయాలతో దూకుడు
## ప్రాంతీయ పార్టీలపై గురి
## ప్రజలను పట్టించుకోని మోడీ
## అధికార దాహంతో ఇష్టారీతిన చర్యలు
## ప్రజల నమ్మకాన్ని కోల్పోతున్న బీజేపీ



**ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం వల్ల ప్రయోజనం ఎంతవరకు ఉంటుందన్న అనుమానాలు చాలామందికి ఏర్పడుతున్నాయి. ఎందుకంటే ఏపీ, తెలంగాణలో ఏదో కేసుల్లో ప్రజాధరణ ఉన్న వారిని ఇరికించి ఏడ్పించినవారే. రేవంత్ రెడ్డిని కేసులో ఇరికించిన కేసీఆర్‌కు భంగపాటు తప్పలేదు. అలాగే జగన్ కూడా టీడీపీ వారిని అరెస్ట్ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వాన్ని నడపిస్తున్నాడు. ఈ క్రమంలో జరుగుతున్న రాజకీయాలను పరిశీలిస్తే కక్షసాధింపు రాజకీయాలే అధికంగా కనిపిస్తున్నాయి. ఇలాంటివి ప్రజలు సహించరని గుర్తించాలి. అక్రమాలు లేదా అన్యాయాలు జరిగితే అన్ని కేసులను ఒకే తరహాలో చూసి, వాటిపై చర్య తీసుకోవాలి. కాని కేజ్రీవాల్ అరెస్ట్, కవితల అరెస్ట్ మోడీ ప్రభుత్వానికి సాధారణంగానే కనిపించవచ్చు. కానీ ఇంతకన్నా ఘోరంగా ఉన్నాయనుకుంటున్న కేసుల్లో ఈడీ రంగంలోకి దిగడం లేదు. ఏపీలో జగన్, తెలంగాణలో కేసీఆర్, అంతకుముందు చంద్రబాబుల అవినీతి విషయంలో పెద్దగా దర్యాప్తు సాగలేదు. అందుకే ప్రజలకు కేంద్రం దర్యాప్తులపై అనుమానాలు ఉన్నాయి.**

**– వరంగల్ వాయిస్, ప్రతినిధి**

తెలంగాణలో మోదీ పర్యటించిన రోజే కేసీఆర్ కుమార్తె కవితను ఢిల్లీ మద్యం కేసులో అరెస్టు చేశారు. సరిగ్గా వారం రోజులకు ప్రధాని భూటాన్‌లో ఉన్నప్పుడు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. కవిత అరెస్టుతో కేసీఆర్ ఆత్మరక్షణలో పడిపోయారు. ఇది కేసీఆర్ ఊహించి ఉండడు. ఇక కేజ్రీవాల్ అరెస్టు వల్ల వచ్చే రాజకీయ పర్యవసానాలను ఎదుర్కోవడానికి కూడా బీజేపీ సిద్ధమై ఉండే ఉంటుంది. అందుకే ఈ ఇద్దరి అరెస్ట్‌లపై కూడా ప్రజలు పెద్దగా స్పందించడం లేదు. ఎందుకంటే ఇంతకన్నా ఎక్కువగా అక్రమాలు, అన్యాయాలు చేసిన వారిని వదిలి పిచ్చుకల బ్రహ్మాస్త్రంలా పడ్డారన్న భావన ప్రజల్లో కలుగుతుంది. అందుకే వీటిపై ఇప్పుడిప్పుడే చర్చ సాగుతోంది. అందువల్ల అవినీతికి సంబంధించిన ఎలాంటి కేసులైనా వదలకుండా ముందుకు సాగితేనే బీజేపీ నిజాయితీ గురించి సానుకూలంగా స్పందిస్తారు.

### ఈసారి ఢిల్లీలో ఎదురు గాలి..

ఈసారి ఢిల్లీ ఎన్నికలు ఆరవ దశలో మే 25న నిర్ణయించారు. అంటే కేజ్రీవాల్ అరెస్టు జరిగిన రెండు నెలలకు ఢిల్లీలో ఎన్నికలు జరుగబోతున్నాయన్నమాట. ఢిల్లీలో పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి ఈ మాత్రం సమయం చాలునని నరేంద్రమోదీ అంచనా వేసుకుని ఉంటారని అనిపిస్తోంది. ఢిల్లీలో గత ఎన్నికల్లో ఏడుకు ఏడు సీట్లు గెలిచిన బీజేపీ ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ చేతులు కలపడంతో కొంత ఎదురు గాలి తప్పదని భావించి ఉంటుంది. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ద్వారా ఆప్‌ను పూర్తిగా అణచివేయాలన్న లక్ష్యం మోడీలో కనిపిస్తోంది.

### ప్రజలను పట్టించుకోని బీజేపీ..

అంతెందుకు మోడీ తన హయాంలో ప్రాంతీయ పార్టీలను దగ్గరకు తీసుకోవడం లేదా వాటిని తుదముట్టించడం అన్న యత్నాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో మోడీ వల్ల ప్రజలకు అంతా మంచే జరిగితే ప్రజలు వీటిని పెద్దగా పట్టించుకోరు. అలాకాకుండా తన రాజకీయ ఎదుగుదలకు అడ్డంగా ఉన్న పార్టీలను మట్టుబెట్టి, ప్రజలను కూడా ధరలు ఇతరత్రా జీఎస్టీ లాంటి పన్నలతో దెబ్బ తీయాలని చూస్తే ప్రజలకు కూడా ఎక్కడో ఒకచోట గట్టిగా దెబ్బకొడతారని బీజేపీ గుర్తిస్తే మంచిది. అందుకే కేజ్రీవాల్ అరెస్ట్ తరవాత పరిశీలిస్తే ఢిల్లీఎన్నికల షెడ్యూలే కాదు, ఇతర రాష్ట్రాల్లోఎన్నికల తేదీలు కూడా బీజేపీ వ్యూహరచనకు అనుగుణంగా ఉన్నాయని గమనించవచ్చు.

### ప్రాంతీయ పార్టీలను దెబ్బ తీసే కుట్ర..

బీజేపీ పెద్దగా ప్రభావం చూపలేని తమిళనాడు, కేరళ ఎన్నికలు మొదటి రెండు దశల్లోనే ఎన్నికలను నిర్వహిస్తున్నారు. బీజేపీ తనకు అనుకూలంగా ఉన్న రాష్ట్రాల్లో ఎన్నికలను వివిధ దశల్లో చివరి వరకూ నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్‌కూ, బీజేపీకీ మధ్య ముఖాముఖి పోటీ జరిగితే బీజేపీదే పై చేయి అవుతుందని మోదీ భావనగా కనిపిస్తోంది. అందుకే ప్రాంతీయ పార్టీలను దెబ్బతీస్తే కాంగ్రెస్ చచ్చిన పాము కనక దాని సంగతి తరవాత చూసుకో వచ్చన్న భావన ఉన్నట్లుగా కనిపిస్తోంది. తెలంగాణలో కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వాన్ని, గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఒకే గాటన కట్టి విమర్శలు చేయడం వల్ల కూడా బీజేపీకి పెద్దగా లాభం ఉండదు. ఇక్కడ కవితను అరెస్ట్ చేయడం వల్ల బీఆర్ఎస్‌ను దెబ్బతీయడం జరగవచ్చు. కానీ, అప్పుడే రేవంత్‌పై నిందలు వేస్తే మాత్రం ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని బీజేపీ గుర్తిస్తే మంచిది.

### తెలంగాణలో అభ్యర్థుల అరువు..

తెలంగాణలో ఇటీవలే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దూకుడును తట్టుకొని బీజేపీ ప్రభంజనం సృష్టించడం కూడా అంత సులువు కాదు. 17 సీట్లు గెలుస్తామని చెప్పడం అతిశయోక్తి కాక తప్పదు. మోదీ ఎంత బలవంతుడైనా స్థానిక నేతలు బలంగా లేకపోతే విజయం సాధించడం కష్టం. స్థానిక నాయకత్వం బలంగా లేకపోవడం కారణంగా తెలంగాణలో కనీసం 17మంది గట్టి నాయకులను తయారు చేసుకోలేక పోయారు. ఇతర పార్టీ నేతల్ని, వ్యాపారస్తుల్ని లాగి వారికి అప్పటికప్పుడే సీట్లు ఇవ్వడం చూస్తే దీనిని అర్థం చేసుకోవచ్చు.

### సౌత్‌లో బీజేపీకి కష్టమే..

ఇక ఏపీలో బీజేపీకి సొంతంగా బలం లేదు. అక్కడ పొత్తులో భాగంగా టీడీపీ, జనసేన ఊపులో ఒకటి రెండు సీట్లు గెలిస్తే ఎక్కువే. ఆరు సీట్లకు పోటీ చేస్తున్న బీజేపీని తెలుగుదేశం గెలిపిస్తే తప్ప గట్టెక్కలేరు. కేరళలో కేంద్ర మంత్రులతో పోటీ చేయించినా ఖాతా తెరుస్తుందా అన్నది అనుమానమే. కర్ణాటకలో కూడా బీజేపీ గత ఎన్నికల్లో 28కి 26 సీట్లు గెలిచినా ఈసారి అన్నిసీట్లు గెలవడం సాధ్యపడదని ప్రచారం సాగుతోంది. అధికారం పోవడంతో మళ్లీ యడ్యూరప్పకు ప్రాధాన్యత పెంచారు. అలాగే గాలి జనార్దన్ రెడ్డి స్థాపించిన 'కల్యాణ రాజ్య ప్రగతి పక్ష' పార్టీ వల్ల బీజేపీకి వచ్చిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయనను బీజేపీలో చేర్చుకోవల్సి వచ్చింది. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడం, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను, పార్టీ నేతలను అరెస్టు చేయడం, ప్రత్యర్థులపై ఏజెన్సీలను ప్రయోగించడం వంటి చర్యల ద్వారా తమ పార్టీ బలం పెంచుకోగలమని బీజేపీ నేతలు అనుకుంటే అది పొరపాటే. అక్రమార్కులను నిజంగానే లోపల వేస్తున్నదని గట్టిగా నమ్మిక వస్తే తప్ప బీజేపీవన్నీ రాజకీయ ఎత్తుగడలుగానే ప్రజలు భావిస్తారు. అందువల్ల ఇలాంటి చర్యలకన్నా ప్రజలకు ఏం మంచి చేస్తే తమ వెంట ఉంటారో ఆలోచన చేస్తే మంచిది.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల కుంభకోణం

## హరీష్ రావు మాజీ పీఏ అరెస్ట్

## తమకు సంబంధం లేదంటూ హరీష్ కార్యాలయం వెల్లడి

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణలో మరో కేసు సంచలనంగా మారుబోతోంది. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ చెక్కుల చెల్లింపులో గోల్‌మాల్ జరిగిందంటూ కేసు రిజిస్టర్ అయింది. ఇందులో మాజీ మంత్రి హరీష్‌రావు వ్యక్తిగత మాజీ సిబ్బంది అరెస్టు కావడం కేసులో కీలకంగా మారుతోంది. ఇప్పటికే ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. వారిలో హరీష్‌రావు పీఏ నరేష్ ఉన్నాడు. అయితే జరుగుతున్న ప్రచారంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు కార్యాలయం స్పందించింది. 'హరీష్ రావు పీఏ సీఎంఆర్ఎఫ్ చెక్కులు కాజేసిండనే వార్తతో జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు వెల్లడించింది. వాస్తవం ఏమిటంటే నరేష్ అనే వ్యక్తి హరీశ్ రావు వద్ద పీఏ కాదు. అతను ఒక కంప్యూటర్ ఆపరేటర్‌గా, తాత్కాలిక ఉద్యోగిగా హరీశ్ రావు కార్యాలయంలో పని చేసే వారు. ఆర్థిక, ఆరోగ్య మంత్రిగా పదవీకాలం పూర్తయిన తర్వాత, ప్రభుత్వ ఆదేశాలు డిసెంబర్ 5న ఆదేశాల ప్రకారం, ఆ ఆఫీస్‌ను తర్వాత రోజు రోజున మూసివేసి, సిబ్బందిని పంపేశాం. ఆ రోజు నుంచి నరేష్ అనే వ్యక్తితో హరీశ్ రావు కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది. అయితే ఆఫీసు మూసివేసే క్రమంలో ఎలాంటి సమాచారం లేకుండా కొన్ని సీఎంఆర్ఎఫ్ చెక్కులను తన వెంట తీసుకువెళ్లినట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై వెంటనే మా కార్యాలయం స్పందించి, నరేష్ అనే వ్యక్తిపై ఆనాడే నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. చట్ట ప్రకారం, తగు చర్యలు తీసుకోవాలని కోరాం. కాబట్టి, ఆ వ్యక్తితో హరీశ్ రావుకి గానీ, కార్యాలయానికి గాని ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. ఈ వాస్తవాలు గుర్తించకుండా తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఒక వ్యక్తి చేసిన తప్పును, మొత్తం కార్యాలయానికి వర్తింపచేయడం బాధాకరం. ఎంతో మంది అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు మా కార్యాలయం సీఎంఆర్ఎఫ్ చెక్కులు కాకుండా, ఎన్నో విధాలుగా సహాయంపడిరది. ఈ విషయం అందరికి తెలిసిందే. వాస్తవాలు గుర్తించాలని కోరుతున్నాం.' అంటూ ప్రకటన రిలీజ్ చేశారు.

# కేటీఆర్ మాటలు తగ్గించుకుంటే మంచిది

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాజీ మంత్రి కేటీఆర్ మాటలు తగ్గించుకుంటే మంచిదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి హితవు పలికారు. బుధవారం హంటర్ రోడ్ లోని సత్యం కన్వెన్షన్ హాల్ లో బీజేపీ వరంగల్ పార్లమెంట్ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ మేయర్ రాజేశ్వర్ రావు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్, బీజేపీ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేష్ లతో కలిసి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ పేరుతో బీఆర్ ఎస్ అధికార దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ అంశం కేంద్రం పరిధిలోకి వస్తుందన్నారు. ప్రజల తిరస్కారానికి గురైన బీఆర్ ఎస్ పార్టీ ముఖ్యులు కేటీఆర్ మాటలు తగ్గించుకుంటే మంచిదని హితవు పలికారు. బీజేపీ, బీఆర్ ఎస్, ఎంఐఎం ఒక్కటి అంటూ ప్రచారం చేసిన కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ది పొందిందన్నారు. ఇప్పుడు అదే ఎంఐఎంతో కాంగ్రెస్ వంత పడుతోందన్నారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజారిటీతో గెలుస్తుందన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన నిధులతో జరిగిన అభివృద్ధిని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని, అందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. మోడీ నేతృత్వంలో జరిగిన అభివృద్ధి ప్రపంచం చూస్తోందన్నారు. మోడీ నాయకత్వంలో ఈసారి 400 సీట్లు గెలువడం ఖాయమన్నారు. వరంగల్ లోను బీజేపీ ఎంపీగా కచ్చితంగా గెలుస్తామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు కాజిపేట వ్యాగన్ పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీ వచ్చిందని గుర్తు చేశారు. ఇంకా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, మామునుర్ ఎయిర్ పోర్టు, ఎడ్యుకేషన్ హబ్ గా వరంగల్ ను తీర్చి దిద్దుతామన్నారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ ప్రభారి డా.వి.మురళీధర్ గౌడ్, బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, గురుమూర్తి శివకుమార్, రావుల కిషన్, రత్నం సతీష్ షా, మురళీధర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాల్లపల్లి కుమారస్వామి, కొలను సంతోష్ రెడ్డి, అర్.పి.జయంత్ లాల్, కొండి జితేందర్ రెడ్డి, దేశిని సదానందం గౌడ్, బాకం హరి శంకర్ పాల్గొన్నారు.

# బీఎస్పీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా గుండాల మదన్ కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ తెలంగాణ ఉద్యమకారుడు బీసీ నాయకుడైన డాక్టర్ గుండాల మదన్ కుమార్ ను వరంగల్ జిల్లా బీఎస్పీ అధ్యక్షుడిగా నియమించారు. నిన్న జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించిన అనంతరం డాక్టర్ మదన్ కుమార్ కు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో క్రియాశీలకంగా పనిచేసిన మదన్ కుమార్ కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యుడిగా, ముదిరాజ్ సామాజిక వర్గానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, వరంగల్ కాశిబుగ్గలో ఒక హాస్పిటల్ డైరెక్టర్ గా, అందరికీ పరిచయం ఉన్న వ్యక్తిగా, ఒక ప్రజా వైద్యుడిగా సుపరిచితులని తెలిపారు. మదన్ కుమార్ తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు హర్షం తెలిపారు. మన బహుజన వాదాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీల హక్కులను కాపాడేందుకు డాక్టర్ మదన్ కుమార్ కృషి చేస్తారని రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తన మీద నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ కు డాక్టర్ గుండాల మదన్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# రేపు మండల సర్వసభ్య సమావేశం

**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు తాడిచెర్లలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరగనుందని ఎంపీడీవో శ్యామ్ సుందర్ తెలిపారు. మల్హర్ మండల ఎంపీపీ చింతలపల్లి మల్హల్ రావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఈ సందర్భంగా వారు కోరారు.

# ప్రజాపాలన అప్లికేషన్‌లో తప్పులను సరిదిద్దాలి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు స్వీకరించిన ప్రజా పాలన అప్లికేషన్ లను ఆన్ లైన్ చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆన్ లైన్ లో తప్పులు దొర్లి అనేక మంది 200 యూనిట్ల ఉచిత కరెంట్ తో పాటు, గ్యాస్ సబ్సిడీ పొందలేక పోతున్నారని ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్, అక్కల బాపు, దయ్యం పోచయ్య ఆరోపించారు. బుధవారం కొయ్యూరులో వారు మాట్లాడుతూ అధికారులు చేసిన తప్పుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తప్పులు సరిదిద్దుకోవడానికి మళ్లీ ప్రజలు జిరాక్స్ కాగితాలతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వారి సమస్యలకు సరైన పరిష్కారం లభించడం లేదని వారు ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి ప్రజా పాలన అప్లికేషన్లలో జరిగిన తప్పులను గ్రామ స్థాయిలోనే పంచాయతీ కార్యాలయాల్లో సరి చేసే విధంగా చర్యలు చేపట్టి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# నిర్దిష్ట గడువులో పన్ను లక్ష్యాన్ని చేరుకోవాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిర్దిష్ట గడువులోగా పన్ను లక్ష్యాలను చేరుకోవాలని సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అండ్ అడ్మినిస్ట్రేషన్) దివ్య దేవరాజన్ అన్నారు. బుధవారం హైదరాబాదులోని సీడీఎంఏ కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్త మున్సిపల్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయం నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీఎంఏ మాట్లాడుతూ పన్ను వసూళ్లలో వార్షిక లక్ష్యాలను చేరుకోవడానికి తక్కువ సమయం ఉన్నందున ప్రణాళిక బద్ధంగా వ్యవహరించి కనీసం 90 శాతం లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వివరణ ఇస్తూ జీడబ్ల్యూఎంసీ వార్షిక పన్నుల లక్ష్యం రూ. 90 కోట్లు కాగా, 71 శాతం వసూళ్లు చేశామని తెలిపారు. పురపాలికల్లో 300 చ.గజా లలో ఇండ్ల నిర్మాణాలు చేపట్టే క్రమంలో తప్పకుండా వర్షపు నీటిని నిల్వ చేయడానికి ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకునే విధంగా అధికారులు తగు చర్యలు చేపట్టాలని సీడీఎంఏ తెలిపారు. ఈఎస్ఎస్ఎల్ సమస్యను స్వల్ప వ్యవధిలో పరిష్కరించడం పట్ల కమిషనర్ ను సీడీఎంఏ అభినందిస్తూ జీడబ్ల్యూఎంసీను ఇతర మ్యూనిసిపాలిటీలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నగర వ్యాప్తం గా అన్ని డివిజన్లలో వీధి దీపాలకు ఈఎస్ఎస్ఎల్ కు చెందిన సాంకేతికతను వినియోగించి చీకటి లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు గోడిశాల రవీందర్, కృష్ణా రెడ్డి, ఈఈ సంజయ్ కుమార్. ఐటీ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్పీ వరంగల్ పార్లమెంట్ ఇంచార్జిగా శనిగరపు రాజు



**వరంగల్ వాయిస్, పరకాల :** నడికూడ మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన శనిగరపు రాజును వరంగల్ పార్లమెంట్ ఇంచార్జిగా బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ బహుజన సిద్ధాంత కర్త మంద ప్రభాకర్ నియమించారు. ఈ సందర్భంగా శనిగరపు రాజు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు తన మీద నమ్మకం తో పార్లమెంట్ బాధ్యతను ఇచ్చినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని గెలుపు దిశగా తీసుకెళ్తూ, ఈ బహుజన రాజ్యాధికార పోరాటంలో తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు బహెన్ జీ కుమారీ మాయావతి నాయకత్వంలో భారత రాజ్యాంగ రక్షణ పోరాటంలో భాగస్వామ్యమవుతున్నందుకు గర్వపడుతున్నానన్నారు. తన నియామకానికి సహకరించి, వెన్నంటి ఉండి బలపరిచిన రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నాయకులకు, ప్రతి ఒక్క కార్యకర్తకు పేరు పేరున శనిగరపు రాజు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మారపెల్లి కట్టయ్య( క్రాంతి కుమార్) అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జీవన్ నగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను కట్టయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కట్టయ్య మట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం, అసమర్థత వల్ల శాయంపేట మండలం అభివృద్ధిలో కుంటుపడిందని, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో మండలాన్ని అన్నిరంగాల్లో ముందు వరుసలో ఉంచడానికి నిరంతరం శ్రమిస్తామని అన్నారు. సీసీ రోడ్డు పనులకు ప్రత్యేక నిధులు కేటాయించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ మండల అధ్యక్షుడు మారపెల్లి రాజేందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల రవిపాల్, ప్రధాన కార్యదర్శి మారపెల్లి వరధరాజు, నాయకులు కొమ్ముల పరమేష్, దైనంపెల్లి సంపత్, మారపెల్లి రాజ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతే షీటీమ్ కర్తవ్యం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశానుసరంగా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో జమాండ్లపల్లి జడ్పీహెచ్ఎస్ లో బుధవారం షీ టీం అవగాహన సదస్సును ఏహెచ్ టీయూ యూనిట్ తో కలిసి సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్సై సునంద షీ టీం సేవలను వివరించారు. మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని అందించాలనే దృక్పథంతో 2014 అక్టోబర్ 24న మహిళా భద్రతా విభాగానికి ఇంచార్జిగా ఉన్న ఏడీజీపీ స్వాతి లక్రా మన రాష్ట్రంలో షీటీమ్‌లను ఏర్పాటు చేశారు. కొత్త జిల్లాల విభజన తర్వాత 2016 డిసెంబర్ 22న మహబూబాబాద్‌లో షీటీం ప్రారంభమైందని తెలిపారు. దీనిలో భాగంగా మహిళలు ఆపద సమయంలో డయల్ 100, షీ టీమ్ నెంబరుకు సంప్రదించాలని కోరారు. ఆడవాళ్ళు ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు, ఏదైనా సమస్య వచ్చినపుడు మౌనంగా భరించకుండా ముందుకు వచ్చి షీ టీమ్ ని సంప్రదించి, వారి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. షీ టీం ను సంప్రదించడానికి క్యూఆర్ కోడ్ విధానాన్ని, ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్ స్టాగ్రాంలను ఉపయోగించుకోవాలని, అలాగే సోషల్ మీడియాలో కూడా షీ టీం ను సంప్రదించవచ్చని తెలిపారు. మానవ అక్రమ రవాణా, ఉమెన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ, క్యూఆర్ కోడ్ పిటిషన్, సైబర్ నేరాల అండ్ సైబర్ సెక్యూరిటీ సేవలు,1930, ఫోక్సో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒకవేళ ఎవరైనా బ్లాక్ మెయిల్ చేసినట్లయితే పరువు పోతుందని భయపడకుండా షీ టీమ్ ని సంప్రదించాలన్నారు. షీ టీమ్ కు కంప్లైంట్ చేసినట్లయితే వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, బాధితురాలు షీ టీమ్ ఆఫీస్ కు రాలేని పక్షంలో షీ టీం సభ్యులే వారి దగ్గరికి వెళ్తారని, కాబట్టి, ఎలాంటి భయం లేకుండా ఫిర్యాదు చేయాలని, షీ టీమ్ వాట్స్ అప్ నంబర్స్ 8712656935, 7901142009 కి తెలియచేసిన చో తగిన చర్య తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ జమాండ్లపల్లి హెచ్ఎం వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, సిబ్బంది, షీ టీమ్ ఏఎస్సై ఆనందం, షీ టీమ్ సిబ్బంది రమేష్, అరుణ, పార్వతి, ఏహెచ్ టీయూ యూనిట్ ఉమెన్ పీసీ ఊర్మిళ పాల్గొన్నారు.

# ఆదివాసీ విప్లవ సాయుధ పోరాట వీరుడు కుంజా రామన్న

## రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** ఆదివాసీ విప్లవ సాయుధ పోరాట వీరుడు కుంజా రామన్నస్మారక స్థూపం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క నివాళులర్పించారు. ములుగు నియోజక వర్గం కొత్త గూడ మండలం మోకాళ్ల పల్లి గ్రామములో జరిగిన కామ్రేడ్ ఆదివాసి లిబరేషన్ టైగర్ వ్యవస్థాపకుడు స్వర్గీయ కుంజా రామన్న 19వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల తో ఆయన స్మారక స్థూపం వద్ద నివాళులర్పించిన రాష్ట్ర మంత్రి సీతక్క మాట్లాడుతూ కుంజా రామన్న మరణం ఆదివాసి సమాజానికి తీరని లోటన్నారు. జల్ జంగిల్ జమీన్ అనే నినాదాన్ని భుజాన వేసుకొని ఇతర ప్రాంతాల వారితో సమానంగా ఆదివాసి సమాజం అభివృద్ధి చెందాలంటే స్వయం పాలన అవసరం అని భావించి దానికి ఉద్యమాలు తప్పనిసరి అని త్రికరణశుద్ధి తో 35 ఏళ్ల పాటు ఉద్యమ జీవితం గడిపారన్నారు. ప్రజాస్వామ్య, సామాజిక మార్పు కోసం అనేక సంఘాలను బలోపేతం చేస్తూ వెనుకబడిన కులలాను చైతన్య వంతులను చేస్తూ అనేక పోరాటాలు చేస్తూ అడవి తల్లి ఒడిలో కన్నుమూయడం జరిగిందన్నారు. ఆదివాసి హక్కుల కోసం ఆదివాసీల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి ఉద్యమ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కవులు, కళాకారులు, ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏప్రిల్‌లో టీడబ్ల్యూజేఎఫ్ 2వ జిల్లా మహాసభ

### సభ్యత్వ నమోదుపై దృష్టి

### టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సమైక్య మహబూబాబాద్ జిల్లా ద్వితీయ మహాసభ ను ఏప్రిల్ మాసంలో నిర్వహించనున్నట్లు ఇందుకు త్వరితగతిన సభ్యత్వ నమోదును పూర్తి చేయాలని టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, సంఘం తరపున మహబూబాబాద్ జిల్లా ఇంచార్జి బొక్క దయాసాగర్ తెలిపారు. బుధవారం మహబూబాబాద్ పట్టణంలో జరిగిన సంఘం జిల్లా అత్యవసర సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బు రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దయాసాగర్ మాట్లాడుతూ టీడబ్ల్యూజేఎఫ్ రెండవ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి, కార్యవర్గానికి తెలియకుండా మహాసభను పెడుతున్నట్లు కొందరు వ్యక్తులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. టీడబ్ల్యూజేఎఫ్ సంఘ నిర్మాణానికి కార్యవర్గం అంత సమిష్టిగా కృషి చేయాలన్నారు. జిల్లా మహాసభలను ఏప్రిల్ మూడవ వారంలో నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. గతంలో అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన మట్టూరి నాగేశ్వరరావు ఏకపక్ష నిర్ణయాన్ని రాష్ట్ర కార్యవర్గం చర్చించి ఆయనపై చర్య తీసుకోవాలని తీర్మానించామన్నారు. తొలుత జిల్లా కార్యదర్శి టి.సదాశివరావు జిల్లాలో జరిగిన పరిణామాలను కార్యవర్గానికి వివరించారు. ఈ సమావేశంలో ఉపాధ్యకులు ఆర్.లక్ష్మణ్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇస్లావత్ నరేష్, కార్యవర్గ సభ్యులు చంద్రమౌళి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

**వరంగల్ వాయిస్, మల్లూర్ :** మండలంలోని తాడిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పై సభ్యులు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. బుధవారం తాడిచెర్ల పీఏసీఎస్ కార్యాలయంలో డీసీవో శైలజ ఆధ్వర్యంలో అవిశ్వాసంపై చర్చ జరగగా సభ్యులు ఎవరూ సమావేశానికి హాజరు కాకపోవడంతో చైర్మన్ పై సభ్యులు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్టు డీసీవో శైలజ ప్రకటించారు. తాడిచెర్ల పీఏసీఎస్ లో మొత్తం 13మంది డైరెక్టర్లు ఉండగా ఇటీవలే అందులో ఒకరు మరణించారు. మిగిలిన 12 మందిలో చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం నెగ్గడానికి 9 సభ్యుల మద్దతు అవసరం కాగా, సమావేశానికి ఒక్క సభ్యుడు కూడా హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగి పోయినట్టు అధికారులు ప్రకటించారు. ఇదీలా ఉండగా రేపు వైస్ చైర్మన్ పై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగనుంది. ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తే వైస్ చైర్మన్ పై అవిశ్వాసం కూడా వీగి పోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. చైర్మన్ పై అవిశ్వాసం నోటీసు ఇచ్చిన సభ్యులే సమావేశానికి హాజరు కాకపోవడం గమనార్హం.

## తైబజార్ వేలం ఖరారు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని అన్నారం షరీఫ్ తైబజార్ వేలం ఖరారు అయినట్లు ప్రత్యేక అధికారి ఎంపీఓ పాక శ్రీనివాస్ తెలిపారు. 2024 -2025 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.33,95,000లకు ఎస్కె. సమ్రిన్ సలెహ దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఅప్షన్ షబ్బీర్, గ్రామ కార్యదర్శి మొహినోద్దిన్, సిబ్బంది యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపల్ పరిధిలోని 19వ వార్డుకు చెందిన వలిపిరెడ్డి నారాయణ అనారోగ్యంతో మరణించగా బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటానని మనోధైర్యాన్నిఇచ్చారు. వారితో పాటు కాంగ్రెస్ నాయకులు దుబాసి వెంకటస్వామి, మెరుగు శ్రీశైలం, సీనియర్ జర్నలిస్టులు మెండు రవీందర్, రేపాల నర్సింహారాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ్ హెల్పింగ్ ట్రస్ట్‌ను ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 19వ డివిజన్ ఓ సిటీలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో ప్రేమ్ హెల్పింగ్ ట్రస్ట్ ను మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా బుధవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నర్మెట్ల ప్రేమ్ కుమార్, మెంబర్స్ సుగుణ, వేణు, శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిలువెరు శీనన్న, సందెల లాజర్, పోలేపాక సుధాకర్, మార్క్ జాన్సన్, శంకర్, ఆదిత్య పాల్గొన్నారు.

## బాధితుడికి చల్లా పరామర్శ




**వరంగల్ వాయిస్, పరకాల :** కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హనుమకొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వరంగల్ జిల్లా రైతుబంధు మాజీ కో ఆర్డినేటర్ బొల్లే భిక్షపతిని బుధవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా భిక్షపతి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. చల్లా ధర్మారెడ్డి వెంట పరామర్శించిన వారిలో నడికూడ మండల దురిశెట్టి చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

## పార్థివ దేహానికి మంత్రి శ్రీధర్ బాబు నివాళి



**వరంగల్ వాయిస్, కాటారం :** హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో కాటారం మండలం విలాసాగర్ గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అందే సత్యనారాయణ భార్య అనారోగ్యంతో మృతి చెందగా ఆమె పార్థివ దేహానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య



**వరంగల్ వాయిస్, కాటారం :** ఉరేసుకొని ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కాటారం మండలం ఒడిపిలవాంచ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిపిలవంచ గ్రామానికి చెందిన ఒన్న వెంకటస్వామి (70) మంగళవారం రాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఇంట్లో వెతికినా కనిపించలేదు. ఉదయం గ్రామంలో వెతకగా ఇంటికి కొద్ది దూరంలో ఉన్న చింత చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందారు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహాదేవపూర్ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వివాహ వేడుకలకు హాజరైన గండ్ర పద్మ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని నూర్జహాన్ పల్లి, సాధన పల్లి గ్రామాలలో బుధవారం జరిగిన వివాహ వేడుకలకు భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు సతీమణి గణపురం జడ్పీటీసీ గండ్ర పద్మ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మండల అధికార ప్రతినిధి చిందం రవి తదితరున్నారు.

# డీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో మహాజన సభ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మహాజన సభ డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయం-నక్కలగుట్టలో నిర్వహించారు. నూతనంగా నిర్మించుకున్న ఆడిటోరియం ను బుధవారం ప్రారంభించారు. ఈ మహాజనసభ లో బ్యాంక్ చైర్మన్ రవీందర్ రావు పాల్గొని మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి రూ. 535.33 కోట్లు ఉన్న లోన్ ఔట్ స్టాండింగ్ ను రూ.1351.33 కోట్లకు తీసుకెళ్లామని తెలిపారు. ఇందులో రైతులకు క్రాప్ లోను 8578 మంది రైతులకు రూ.196 కోట్లు గాను, అలాగే ఎల్ టీ రుణాలకు సంబంధించి 3840 మంది రైతులకు రూ.26 కోట్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఎస్ హెచ్ జీ రుణాలు 140 మందికి రూ.85 కోట్లు, జేఎల్ జీ రుణాలు 22 మందికి రూ.7 కోట్లు, పీఎం ఈ జీపీ 86 మందికి రూ.10 కోట్ల రుణాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. మొత్తం ఈ నాలుగు సంవత్సరాలలో కమిటీ వచ్చిన దగ్గర నుంచి కొత్తగా 30,500 మందికి రూ.810 కోట్ల రుణాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మాడుగుల రమేష్, నాయిని రంజిత్, దొంగల రమేష్, చెట్టుపల్లి మురళి, ఎస్.నరసింహారావు, ఎర్రబెల్లి గోపాలరావు, కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి, జి.రాజేశ్వరరెడ్డి, చాపల యాదగిరి రెడ్డి, కక్కిరాల హరిప్రసాద్, పోలేపాక శ్రీనివాస్, ఎలగం రవిరాజ్, అన్నమనేని జగన్మోహన్ రావు, కొండ నరేందర్, ప్రదీప్ చందర్, డిస్టిక్ కోపరేట్ ఆఫీసర్లు జి. నాగేశ్వరరావు, ఎన్.వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల చైర్మన్లు, బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్ , జీఎం శ్రీధర్, డీజీఎంలు రోహిణి, దమయంతి, కురువ నాయక్, ఏజీఎంలో రాజశేఖర్, నవీన్, రాధిక , కళ్యాణి, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## టెట్ దరఖాస్తు రుసుము తగ్గించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉపాధ్యాయ అర్హత టెస్ట్ టెట్ దరఖాస్తు రుసుము భారీగా పెంచారని, ఆ ఫీజును తక్షణమే తగ్గించాలని బహుజన సంక్షేమ సంఘం (బీఎస్ఎస్)ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ గతంలో టెట్ ఎగ్జామ్ ఒక పేపర్ రాసేవారికి రూ.200, రెండు పేపర్లు రాసేవారికి రూ.300 ఉండేదని అన్నారు. కానీ, ఇప్పుడు టెట్ దరఖాస్తు ఫీజు ఏకంగా వెయ్యి రూపాయలు పెంచడం రెండు పేపర్లు రాసేవారికి 2000 పెంచడం దారుణమని ఈ సందర్భంగా అన్నారు. ఈ ఫీజు పెంచడం మూలంగా నిరుద్యోగులు చాలా ఇబ్బంది పడతారని వాపోయారు. ఈ రాష్ట్రంలో ఉన్న 7 లక్షల మంది నిరుద్యోగులను పరిగణలో తీసుకొని టెట్ దరఖాస్తు ఫీజు వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కోర్టులో ఈ సేవా కేంద్రం ప్రారంభం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కోర్టులో ఈ సేవా కేంద్రాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్.డి వై. చంద్రచూడ్ వర్చువల్ విధానంలో బుధవారం సాయంత్రం 5-45 నిమిషాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఈ- సేవా కేంద్రం ద్వారా కేసు స్థితిగతులు, కేసుకు సంబంధించిన పూర్తి సమాచార వివరాలను సర్టిఫై కాపీలను పొందవచ్చున్నారు. న్యాయవ్యవస్థలోని (12) రకాల పౌర సేవలను అత్యంత వేగంగా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఈ కేంద్రాన్ని ప్రారంభించామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జడ్జి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి కె. మౌనిక, అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డి .వెంకటస్వామి, ప్రభుత్వా న్యాయవాది కొంపెల్లి వెంకటయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాదులు సురేష్ రెడ్డి, రవికుమార్, నగేష్ , స్పెషల్ ఫోక్సో కోర్టు పిపి పద్మాకర్ రెడ్డి, ఏజీపీ ఆనంద్ కుమార్, కోర్టు సిబ్బంది, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ తొలి బాధితుడిని తానే

### దుబ్బాక ఎన్నికల్లో మా ఫోన్లు ట్యాప్ చేశారు

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### డీజీపీకి బీజేపీ నేత రఘునందన్ రావు ఫిర్యాదు




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మొదటి బాధితుడిని తానేనని, కేసీఆర్ ప్రమేయం లేకుండా ఫోన్ ట్యాపింగ్ చేయలేరని బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. దుబ్బాక ఎన్నికల్లో నా ఫోన్, నా కుటుంబ సభ్యుల ఫోన్ ట్యాపింగ్ చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు డీజీపికి ఫిర్యాదు చేశారు. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, అరెస్టైన డీఎస్పీ చెప్పారని మీడియాలో వచ్చింది. అప్పుడే నేను డీజీపికి ఫిర్యాదు చేశానని రఘునందన్ రావు అన్నారు. నేను అనుమానించినట్లుగానే నా ఫోన్, నా కుటుంబ సభ్యుల ఫోన్ ట్యాపింగ్ చేశారని రుజువైంది. ఈ కేసులో మొదటి ముద్దాయిగా కేసీఆర్, రెండో ముద్దాయిగా హరీష్ రావు, మూడో ముద్దాయిగా అప్పటి మెదక్ కలెక్టర్ వెంకట్రామిరెడ్డిని చేర్చి.. ఇప్పటికైనా నిష్పక్ష పాతంగా విచారణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి, చీఫ్ జస్టిస్ కు విజ్ఞప్తి చేస్తున్నానని రఘునందన్ రావు అన్నారు. గతంలో బేగంపేట లో కోటి రూపాయలు పట్టుబడ్డ కేసులో ప్రస్తుత ఎమ్మెల్యేలు రాజ్ గోపాల్ రెడ్డి, వివేక్ వెంకట్ స్వామిలు కూడా బాధితులే.. ఆకేసు కూడా ముందుకు పోలేదన్నారు. వారు కూడా ఫిర్యాదు చేయాలని రఘునందన్ రావు విజ్ఞప్తి చేశారు. అప్పటి డీజీపీ, ట్యాపింగ్ పరికరం కొన్న డీఎస్పీ , పీఏ, కేసీఆర్, హరీష్ రావు, సంతోష్ రావు లను విచారణ చేసి బాధ్యులను అరెస్ట్ చేస్తారని నమ్ముతున్నా అని రఘునందన్ రావు అన్నారు. కోర్టు న్యాయమూర్తుల ఫోన్లను కూడా విన్నారని చంద్రబాబు కూడా చెప్పారు. సీజేఐకి ఫిర్యాదు చేయాలని న్యాయమూర్తులను కోరుతున్నానని అన్నారు. కర్ణాటక, ఆంధ్రలోని రాజకీయ నాయకులను ట్యాపింగ్ చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిని బెదిరించి రెండు కోట్ల నగదును తెచ్చారని, 13 కోట్లు విలువైన బాండ్స్ ను కొనిపించారని రఘునందన్ రావు ఆరోపించారు. దీనిపై పోలీసులు వెంటనే విచారణ చేయాలని రఘునందన్ రావు కోరారు.

# ఆస్పత్రుల్లో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి కళావతి భాయి ఆధ్వర్యంలో బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని మైత్రి హాస్పిటల్, లక్ష్మీ హాస్పిటల్, చిన్నారి పిల్లల హాస్పిటల్, మన్మోహన్ రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్కానింగ్ సెంటర్లలలో లింగ నిర్ధారణ పరీక్షలు అనుమతి పొందిన రేడియాలజిస్టులు లేదా గైనకాలజిస్ట్ లు మాత్రమే గర్భవతులకు స్కానింగ్ చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన తర్వాత ఆడ, మగ అని చెప్పటం చట్టరీత్యా నేరమని వివరించడం జరిగింది. అన్ని స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ చేసే గదిలో, వేచియుండు హాలులో తప్పకుండా ఇక్కడ లింగ నిర్ధారణ చెప్పబడదనే బోర్డు పెట్టాల్సిందిగా ఆదేశించారు. ఫామ్-ఎఫ్ ఏ రోజువి ఆ రోజే ఆన్ లైన్ చేయాలని, ఆన్ లైన్ చేసిన అన్ని ఫారం-ఎఫ్ లు అన్నీ ప్రతినెల 5 లోపు కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. అలాగే ప్రతి హాస్పిటల్ మేనేజ్ మెంట్ వారు ధరల పట్టికను ప్రదర్శించాలని పేర్కొన్నారు. పట్టణంలో అనుమతి లేని చిన్నారి పిల్లల హాస్పిటల్, మన్మోహన్ రెడ్డి మల్టీస్పెషాల్టి హాస్పిటల్లను గుర్తించి అనుమతి లేనందుకుగాను నోటీసులు అందజేశారు. వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి, సీహెచ్ బిందు శ్రీ, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఆరోగ్య విద్యా బోధకులు బి మహేందర్ రెడ్డి, పీహెచ్ఎన్ కావేటి మంగమ్మ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

### కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రభుత్వం సూచించిన గడువులోగా సీఎంఆర్ కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యాలను పూర్తి చేయాలి, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లాలోని రైస్ మిల్లర్లు సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కష్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాలపై, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్, 23-24, సంవత్సరం లక్ష్యం 38.039 మెట్రిక్ టన్నులని, ఈ లక్ష్యాలను ప్రభుత్వ సూచించిన గడువులోగా వెంటనే పూర్తి చేయాలని సంబంధిత మిల్లర్లను ఆదేశించారు. లేని పక్షంలో సంబంధిత మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, అందులో భాగంగానే పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో (185) సెంటర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరుపతి సంఘం ఆధ్వర్యంలో (125) ఐకేపీ ఆధ్వర్యంలో (49) జీసీసీ ఆధ్వర్యంలో (7) తదితర (4) కేంద్రాలను ఏప్రిల్ 1న ఏర్పాటు చేయడం కోసం అన్ని చర్యలు తీసుకోవాలని, సంబంధిత కేంద్రాలలో మౌలిక వసతులు విద్యుత్ సరఫరా, టాయిలెట్స్, టార్పాలిన్, ప్యాడి క్లీనర్స్, గన్ని సంచులు, వేయింగ్ మిషన్, తదితరు సౌకర్యాలు కల్పించి, ప్రభుత్వం సూచించిన తేమశాతం మేరకు మ్యాచ్చర్, చూసి ధాన్యం కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆకాల వర్షాల కారణంగా పంట ధాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.ప్రస్తుతం ఎన్నికల నియమ నిబంధనలు అమలులో ఉన్నందున రాజకీయ నాయకుల ద్వారా ప్రారంభోత్సవాలు చేయకూడదని, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సెంటర్ నిర్వాహకులకు సూచనలు జారీ చేశారు. ప్రతి కేంద్రంలో వ్యవసాయ శాఖ, ఐకేపీ, సహకార శాఖ, హార్టికల్చర్, సంబంధిత అధికారులు, బృందంగా ఏర్పడి కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేయుటలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, వ్యవసాయ శాఖ అధికారి హరి ప్రసాద్, డీఎస్ఓ రాజేందర్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, డీహెచ్ఓ మరియన్న, మిల్లర్లు వెంకటేశ్వర్లు, తదితర సంబంధిత పాల్గొన్నారు.

బుధవారం 27, మార్చి 2024
www.warangalvoice.net

# కాలువలతో చెరువుల్లో నీటిని నింపాలి

## మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



**వరంగల్ వాయిస్, రేగొండ :** రాష్ట్రంలో, నియోజకవర్గంలో రైతులు వేసిన యాసంగి నాట్లు నీరు లేక ఎండిపోతున్న దృష్ట్యా వెంటనే కాలువల ద్వారా నీటిని వదిలి చెరువులు నింపి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి కోరారు. బుధవారం రేగొండ మండలం రంగయ్యపల్లి గ్రామంలో చేతికొచ్చిన వరి పంట నీరులేక ఎండిపోయిన వరి పొలాలను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి రైతు కాంతాల నారాయణ రెడ్డి కి చెందిన ఎండిపోయిన పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధ పాలన వలన పక్కనే డీబీఎం 38, ఎస్సారెస్పీ కాలువలు కలిగి ఉన్న నీళ్లు వదలకపోవడంతో రైతులు వేసిన రెండవ పంటలు పూర్తిగా ఎండిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రైతు కాంతాల నారాయణరెడ్డి వరి పొలం చేతికి వచ్చే సమయంలో నీరు అందకపోవడంతో నష్టపోయాడన్నారు. గత ఏడాది ఇదే మాసంలో సమృద్ధిగా నీరు ఉన్న పరిస్థితి ఉండేదని, నేడు రైతులకు నీరు అందకుండా ధీన స్థితిని కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో ఎస్సారెస్పీ డీబీఎం 38 కాలువ ద్వారా నేరుగా 24చెరువులు విధంగా రైతులకు నీరు వదిలి అవి నిండాక మత్తడి పోస్తే 34చెరువులు నిండడంతో రైతు పొలాల వద్ద బావుల్లో భూగర్భ జలాలు పెరిగి సమృద్ధిగా నీరు అందేదన్నారు. దొంగ హామీలిచ్చి గద్దనెక్కిన సర్కారు నేడు కాళేశ్వరం గేట్లు తెరవడం చేతకాక, పార్టీ ఫిరాయింపుల గేట్లు తెరిచిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇస్తామన్న రైతు బంధు రాలేదు, బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో కొనసాగుతున్న రైతు బంధు సహాయం ఇంకా కొనసాగుతుందని,ఎండిపోయిన వరి సాగు రైతులకు ప్రభుత్వ రు.25 వేలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర డిమాండ్ చేశారు.అనంతరం లక్ష్మీ నరసింహ స్వామిని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి దర్శించుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులు అంకం రాజేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ మాదాడి అనిత కరుణాకర్ రెడ్డి, మండల బీసీ సంఘం నాయకులు బండి రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ దగ్గు సంధ్యారాణి వెంకటేశ్వరరావు, పబ్బ శ్రీనివాస్ గౌడ్, యూత్ నాయకులు పోగు సుమన్, ఎస్సీ సెల్ యూత్ నాయకులు పశువుల అశోక్, నాయకులు మనోహర్రావు, లింగంపల్లి బాబురావు, మండల మీడియా కన్వీనర్ దాట్ల రాజేందర్, రైతులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యకు యత్నించిన యువకుడు కాపాడిన హోంగార్డ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ లో ట్రైన్ కింద పడి చనిపోవడానికి ప్రయత్నించిన వ్యక్తిని వరంగల్ ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ రవి ప్రాణాలకు తెగించి కాపాడాడు. యువకుడి ప్రాణాలు కాపాడిన హోం గార్డ్ ను స్థానికులు అభినందించారు.

# బొడ్రాయి ప్రతిష్ఠాపనలో సీతారాం నాయక్



**వరంగల్ వాయిస్, గార్ల :** ఇల్లందు నియోజకవర్గం గార్ల మండలం గోపాల్ పూర్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మహబూబాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి, మాజీ పార్లమెంట్ సభ్యుడు ప్రొఫెసర్ సీతారాం నాయక్ బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు.

# ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ కట్టకుంటే ఆస్తులు జప్తు

## మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరైన ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్ అన్నారు. బుధవారం డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా ఆస్తి పనుల వసూల్ పై స్టేట్ వైడ్ గా పేరుకుపోయిన బకాయిల పైన సీరియస్ గా ఉన్నందున పన్నుల వసూలు 100 శాతం లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తొర్రూరు పట్టణంలోని పేరుకుపోయిన బకాయి వసూలు మొండిపద్దులు ఉన్నాయని, రేపటి నుంచి వారి ఆస్తులను జప్తు చేయడం జరుగుతుందని కాబట్టి, బకాయి దారులు తమ ఆస్తి పన్ను చెల్లించి మున్సిపాలిటీకి సిబ్బందికి సహకరించాలని కోరారు. 2023-24 సంవత్సరానికి గాను భారీగా పేరుకుపోయిన ఆస్తి పన్ను దారులకు నోటీసులు ఇచ్చిన వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం వలన నేటి నుంచి వారి ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందన్నారు. సంబంధిత పేరుకుపోయిన బకాయిదారులకు మౌఖికంగా చెప్తున్నా కానీ ఇంతవరకు టాక్స్ కట్టని సముదాయాలను సీజ్ చేసి మున్సిపాలిటీకి తరలించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ శాఖ ఆస్తి పన్నుపై అధిక మొత్తంలో పెనాల్టీ పైన 90 శాతం మినహాయింపు ఇస్తున్నందున అందరూ ఉపయోగించుకొని పేరుకుపోయిన తమ ఆస్తి పన్నులను 90 శాతం మినయింపుతో సకాలంలో చెల్లించి లబ్ధి పొందాలన్నారు. అలాగే పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని అక్కల్ చెడ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తేజావత్ బీమా-బుజ్జి దంపతుల కుమార్తె అనూష-భిక్షపతిల వివాహ వేడుకకు హాజరైన శాసన సభ్యుడు దొంతి మాధవరెడ్డి నూతన దంపతులకు ఆశీర్వాదం అందించారు. వీరి వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, చెన్నారావు పేట, నర్సంపేట మండలాల అధ్యక్షులు భూక్య గోపాల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, మండల ఉపాధ్యక్షులు నన్నెబోయిన రమేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేన రమేష్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భూక్య భాస్కర్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు అమీరొద్దీన్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సంపత్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, కుండే కుమారస్వామి, మాజీ ఉప సర్పంచ్ బానోతు వీరన్న నాయక్, బోనగిరి స్వామి, ముత్యం భద్రయ్య, భూక్య సురేష్, కట్ట స్వామి, గ్రామ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు చిలుక రామక్క, మైనారిటీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి కయాజ్, తేజావత్ శివ, భూక్య రాజు, తేజావత్ రాజు, బాలు, సురేష్, పోటీయా వీరు, బానోతు బాలు, శ్రీకాంత్, స్వామి నాయక్, మూడు రాజు, భద్రు, బీమా, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో భారీ చేరికలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నాంపల్లి గాంధీభవన్ లో వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు సమక్షంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ సిరంగి సునీల్ తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు 200 మందిని కిసాన్ సెల్ చైర్మన్, టీపీసీసీ క్రమశిక్షణా సంఘం చైర్మన్ ఎం.కోదండ రెడ్డి బుధవారం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, రుద్వేగ్ రెడ్డి, జన్ను అనిల్, 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీరం రవీందర్ రెడ్డి, కందుకూరి పూర్ణచందర్, రజినీకాంత్, బొమ్మ చంద్రమౌళి గౌడ్, వియ్యాల సునీత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పరపల్లి- దీక్షకుంట్ల రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

## అందె లక్ష్మీనారాయణ



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని ఉప్పరపల్లి గ్రామం నుంచి దీక్షకుంట్లకు వెళ్లే రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని తెలంగాణ రైతు కూలీ సంఘం వరంగల్ జిల్లా నాయకులు అందె లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రైతు కూలీ సంఘం ప్రతినిధుల బృందం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామం నుంచి దీక్షకుంట్లకు వెళ్లు రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయన్నారు. ఉప్పరపల్లి గ్రామం చివరలో చెరువు నుంచి వచ్చే వరద మూలంగా రోడ్డుకు వేసిన పైపులు సరిపడలేనందున రోడ్డు ప్రతి సంవత్సరం కోతకు గురికావడం జరుగుతుందన్నారు. దీని మూలంగా ఉప్పరపల్లి నుంచి దీక్షకుంట్లకు వెళ్లే ప్రజలకు, అటువైపు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు నిరంతరం ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి మళ్లీ యధావిధిగా తక్కువ పైపులు వేసి రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. దీని మూలంగా మళ్లీ రోడ్డు తెగి పోయే ప్రమాదం ఉందని కాబట్టి, సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేయాలని, అటు వెళ్లే ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు అందె మార్కండేయ, చింతకింది ఐలయ్య, చింతకింది వీరన్న, రెడ్డబోయిన గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# తార రెసిడెన్సీ హోటల్‌ను ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని అలంకార్ జంక్షన్ కాకతీయ కాలనీలో ఏర్పాటు చేసిన నూతన తార రెసిడెన్సీ హోటల్ ను బుధవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హోటల్ యాజమాన్యం శ్రీధర్, రాధిక, కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ సత్యసాయి కన్వెన్షన్
# సకల సౌకర్యాల నిలయం



- ఉమ్మడి జిల్లాకే తలమానికం
- 52 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం
- నేషనల్ హైవే 163 పై జనగామ సమీపంలో ఏర్పాటు
- వైభవోపేతంగా ప్రారంభోత్సవం
- హాజరైన మంత్రి కొండా సురేఖ

ఉమ్మడి వరంగల్ జిల్లాకే తలమానికంగా జనగామ జిల్లా యశ్వంతా పూర్ ప్రధాన రహదారిలోని శ్రీ సత్యసాయి కన్వెనషన్ ఏసీ హాల్ నిలువనుంది. ఆధునిక హంగులు, సకల సౌకర్యాలను ఈ కన్వెనషన్ ద్వారా ప్రజలకు మరింత చేరువ కానున్నాయి. ఎలాంటి వేడకైనా మధురమైన అనుభూతిగా కలిగేలా ఏర్పాట్లు చేశారు. 52 ఎకరాల సువిశాల ప్రాంగంణలో నిర్మితమైన ఈ శ్రీ సత్యసాయి కన్వెనషన్ ఏసీ హాల్ మీ అన్ని అవసరాలను తీర్చుటకు సిద్ధంగా ఉంది.

## కన్నులపండువగా ప్రారంభోత్సవం..

శ్రీ సత్య సాయి ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ చైర్మన్, ప్రముఖ కాంట్రాక్టర్ వేముల సత్యమూర్తి నూతనంగా నిర్మించిన శ్రీ సత్యసాయి కన్వెనషన్ ఏసీ హాల్ ప్రారంభోత్సవం బుధవారం కన్నులపండువగా జరిగింది. జనగామ-రఘునాథ్ పల్లి గ్రామాల 163 నేషనల్ హైవేకు అనుకొని 52 ఎకరాల విస్తీర్ణంలోని కొంత భాగంలో ఈ కన్వెన్షన్ హాల్ నిర్మాణం చేశారు. మొదట వేముల సత్యమూర్తి కుటుంబ సభ్యులు గొట్టిపాముల వాణి- ఆశిష్ కుమార్, వేముల రంజిత్, అపూర్వ, వేముల ఉమాదేవి వేదమూర్తులచే చండీ యాగం నిర్వహించారు. అనంతరం అదే హాలులో శ్రీ సీతారామ కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపారు.

## ప్రముఖుల హాజరు..

అంతకుముందు తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శ్రీ సత్యసాయి కన్వెనషన్ ఏసీ హాల్ నులాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే , మాజీ మంత్రి కడియం శ్రీహరి, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కార్పొరేటర్ అభినవ్ భాస్కర్, ధీంబాయ్ టీవీ న్యూస్ ఛానల్ సీఈవో వేముల సదానందం, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, పూర్వ అధ్యక్షుడు, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల బాలరాజు, క్రెడాయి రాష్ట్ర నాయకులు బాల్నే శరత్ బాబు, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ వేముల రంజిత్, గొట్టిపాముల వాణి, ఆశిష్, జనగామ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి, లయన్ వేముల గురుమూర్తి, టి రాజేందర్ రెడ్డి, చల్లా లింగారెడ్డిలతో పాటు పలువురు కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తలు, బ్యాంకు అధికారులు, పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేముల సత్యమూర్తికి సన్మానం..

శ్రీ సత్య సాయి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ చైర్మన్ వేముల సత్యమూర్తిని పలువురు శాలువా కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రేటర్ వరంగల్ నగరానికే తలమానికంగా నిర్మించిన శ్రీ సత్యసాయి ఏసీ కన్వెన్షన్ హాల్ మాదిరిగానే ఇది జనగామ జిల్లాకే వన్నె తేనుంది. శ్రీ సత్యసాయి కన్వెన్షన్ ఏసీ హాల్ నిర్మించడం పట్ల జనగామ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

- వరంగల్ వాయిస్, జనగామ














# తాగునీటిపై స్పెషల్ ఫోకస్

**ఇబ్బందులు లేకుండా చర్యలు**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో సమీక్ష**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో తాగునీటికి సంబంధించి సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా వివిధ పనులపై బుధవారం ఆమె సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన అన్ని మండలాల్లోని గ్రామాల్లో తాగునీటి సరఫరాకి సంబంధించి బోర్లు, చేతిపంపులు, మోటార్లు, పైప్ లైన్ల మరమ్మతులు, మిషన్ భగీరథ నీటి సరఫరా తదితర అంశాలపై కలెక్టర్ అధికారులనుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి సరఫరాకు ఎక్కడ కూడా ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే సత్వరమే పరిష్కరించే విధంగా అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటి సరఫరాకు సంబంధించి పురోగతిలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ డీఈలు ఇ.సునీత, శ్వేత, చంద్రు నాయక్, జీవన్ ప్రకాష్, శ్రీనివాస్, జిల్లాలోని మండలాల ఏఈలు పాల్గొన్నారు.

### ఈవీఎంలపై అవగాహన..

ఎన్నికల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎంల) పనితీరుపై బుధవారం సాయంత్రం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సెక్టార్ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని సెక్టార్ అధికారులకు పోలింగ్ తేదీన ఈవీఎంల (కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివిప్యాట్) పనితీరు, ఏ విధంగా నిర్వహించాలనే వివిధ అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. పోలింగ్ రోజున మాక్ పోల్ మొదలుకొని పోలింగ్ అనంతరం సెక్టార్ అధికారులు నిర్వర్తించే విధులను గురించి ట్రైనర్లు అవగాహన కల్పించారు. సెక్టార్ అధికారులకు మోడల్ ఈవీఎంలతో వాటి పనితీరు గురించి ప్రత్యక్ష అవగాహనను కల్పించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, మాస్టర్ ట్రైనర్లు భాస్కర్ రెడ్డి, రవి, రాంబాబు, పృథ్వీ, శివకోటి, శ్రీధర్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర కీలకం

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య**

**వీడియో కాన్ఫరెన్స్ లో దిశానిర్దేశం**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాలునుంచి జిడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే, హన్మకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, సంధ్యారాణిలతో కలిసి సార్వత్రిక ఎన్నికలకు నియమించిన ఆయా విభాగాల నోడల్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బంది విధులు, శిక్షణ, మెటీరియల్, రవాణా, స్వీప్, శాంతి భద్రతలు, ఈవీఎంల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన నియామావళి, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, ఈటీబీపీఎస్, వ్యయ పర్యవేక్షణ, ఓటర్ల జాబితా, మీడియా మేనేజ్‌మెంట్, ఎంసీఎంసీ, సోషల్ మీడియా యూనిట్లు, కాంప్లెయింట్, మానిటరింగ్ సెల్, 1950 కాల్ సెంటర్ల నిర్వహణ తదితర విభాగాల నోడల్ అధికారులకు ఎన్నికల కోడ్ సమయంలో నిర్వహించాల్సిన విధులపై కూలంకషంగా వివరించారు. జిల్లా నోడల్ అధికారులందరూ వారికి కేటాయించిన ఎన్నికల విధుల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పార్లమెంటు ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విధులను నిర్వహించాలని , ఆయా విభాగాల జిల్లా నోడల్ అధికారులు పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసంబ్లీ సెగ్మెంట్ల సిబ్బంది సమన్వయంతో నివేదికలు సేకరించి సమగ్ర నివేదికలను నిర్దేశిత కాలంలో తప్పని సరిగా పంపాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రతి ఉద్యోగి ఖచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకొనుటకు గాను ఫారం 12 సమర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలింగ్ బూత్ ల వద్ద మౌలిక వసతులు, అవసరమైన రాంపులను, వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, నీడ, వంటి ఇతర సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మొదటి రాండమైజేషన్ పూర్తయినందున పీఓ, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్నికల సామాగ్రికి సంబంధించి ఎప్పటి కప్పుడు రాష్ట్ర స్థాయి నోడల్ అధికారులతో సంప్రదింపులు చేస్తూ ఎన్నికల సామాగ్రిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై సంబంధిత నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం, సి- విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ రవీందర్, డీఆర్ ఓలు శ్రీనివాస్, గణేష్, ఆర్డీఓలు దత్తు, కృష్ణవేణి, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీకాంత్, ఎన్నికల పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

### ‘స్వీప్’ పటిష్టంగా అమలు చేయాలి..

ఓటర్లను చైతన్య పరచుటకు రూపొందించిన జిల్లా స్వీప్ కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.ప్రావిణ్య ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో స్వీప్ కార్యక్రమాల కార్యచరణపై సంబంధిత నోడల్ ఆఫీసర్లతో జరిగిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో స్వీప్ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, డీపీఆర్ ఓ అయూబ్ అలీ, డీఈఓ వాసంతి, జీఎం ఇండస్ట్రీస్ నరసింహమూర్తి, డీపీఓ కల్పన, ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

**రూ.3 లక్షల పెనాల్టీ**

**వరంగల్ వాయిస్, వడ్డేపల్లి :** ప్రశాంత్ నగర్ ప్రాంతానికి చెందిన జనగామ జిల్లా పాలకుర్తి మండలం పెద్ద తండాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సముద్రాల శేషగిరిరావుకు చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు శిక్షతో రూ.3 లక్షల చెక్ అమౌంట్ పై మరో 3 లక్షల ఫైన్ విధిస్తూ హనుమకొండ మూడో అదనపు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక సిరిసిల్ల మంగళవారం తీర్పు చెప్పారు. కేసు పూర్వాపరాల్లోకి వెళితే, హనుమకొండ నివాసి నిమ్మల శ్రీనివాస్ నుంచి తన అవసరాల నిమిత్తం సముద్రాల శేషగిరిరావు 2018 సంవత్సరంలో రూ.3 లక్షలు అప్పుగా తీసుకొని ప్రామిసరీ నోట్ ఇచ్చారు. కొంతకాలం తర్వాత అప్పు తీర్చమని కోరగా వడ్డీతో సహా కలుపుకొని మొత్తానికి ఒక చెక్కు ఇచ్చారు. ఆ చెక్కు చెల్లుబాటు కాకపోవడంతో శేషగిరిరావుపై కోర్టులో చెక్ బౌన్స్ కేసు వేసి తగు సాక్షాదారాలతో శ్రీనివాస్ ఇంతకాలం న్యాయపోరాటం చేసి విజయం సాధించారు. శ్రీనివాస్ తరఫున హనుమకొండ కు చెందిన సీనియర్ న్యాయవాది భూపతి శంకర్ కేసును వాదించారు.

# పెంబర్తి చెక్ పోస్ట్ తనిఖీ చేసిన సీపీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేస్తూ సిబ్బందికి దడ పుట్టిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం జనగాం పోలీస్ స్టేషన్ పరిధిలోని పెంబర్తి ఎన్నికల చెక్ పోస్ట్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భముగా చెక్ పోస్ట్ సిబ్బంది నిర్వహిస్తున్న తనిఖీ తీరును పరిశీలించారు. చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రత సిబ్బందితో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. తనిఖీ సమయాల్లో ప్రజలతో మార్యాదపూర్వకముగా వ్యవహరించాలని, అలాగే వారు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా జాగ్రత్త పడాలన్నారు. అదే సమయంలో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ భద్రత సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో జనగామ ఇన్స్ స్పెక్టర్ రఘు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి**



**వరంగల్ వాయిస్, ములుగు :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల నిర్వహణ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ఈ మేరకు ఆమె బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల నిర్వహణ అధికారి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో పోలింగ్ శాతం పెంచే విధంగా ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు ఓటర్ అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, ఎన్నికల కోడ్ ఉల్లం ఘనలపై నేరుగా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం, రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని, సి-విజిల్ యాప్ ద్వారా లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చని, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కూడా ఫిర్యాదులు 24 గంటల పాటు నమోదు చేయవచ్చని తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు తమ ఓటు హక్కును ఎలాంటి భయభ్రాంతులు లేకుండా ధైర్యంగా ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, ఏటూరు నాగారం అదనపు ఎస్పీ గీతే మహేష్ బాబా సాహెబ్, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ఎస్పీ శబరీష్, జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com